సాక్షి
పెద్దపల్లి

గురువారం, 30, జనవరి, 2025

తెల్లారిన బతుకులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): కాట్నపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలకు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగింది.

- వివరాలు 8లో ▸



మండలి కోడ్ కూసింది

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల
- వచ్చేనెల 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు
- మార్చి 8న పూర్తి కానున్న ఎన్నికల ప్రక్రియ
- పకడ్బందీగా కోడ్ అమలు : కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

శాసనమండలిలో త్వరలో ఖాళీ కానున్న ఉమ్మడి కరీంనగర్-మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల టీచర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. బుధవారం మధ్యాహ్నం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రారంభోత్సవాలను అధికార పార్టీ నాయకులు వాయిదా వేసుకున్నారు. మరోవైపు.. ఎన్నికల కోసం ఇంతకాలం సిద్ధమవుతున్న ఆయా పార్టీల నాయకులు, స్వతంత్రులు ప్రచార వేడిని పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకానుండగా.. మార్చి 8వ తేదీన ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

- సాక్షిప్రతినిధి, కరీంనగర్



సింహభాగం ఇక్కడే..

ఉమ్మడి జిల్లాలోని పట్టభద్రులు, టీచర్ల సింహభాగం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. గతే దాది డిసెంబరు 30 వరకు 3.41లక్షల పట్టభద్రుల ఓట్లు ఉండగా, కరీంనగర్‌లో దాదాపు 1.55 లక్షలకుపైగా ఓట్లున్నాయి. టీచర్ల ఓట్ల విషయానికి వస్తే.. మొత్తం 25,921 ఓట్లు ఉండగా.. 7,659 ఓట్లు కరీంనగర్‌లో ఉన్నాయి. అందుకే, టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఉమ్మడి జిల్లాపైనే దృష్టి కేంద్రీకరించారు. మిగిలిన మూడు జిల్లాల్లో ప్రచారం చేస్తూనే.. కరీంనగర్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికితోడు ఈనెల ఒకటో తేదీ నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు కోసం మరోసారి అవకాశం ఇవ్వగా.. 3,251 గ్రాడ్యుయేట్లు, 676 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు.

ఉమ్మడి జిల్లా ఓటర్లు
పట్టభద్రుల ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కరీంనగర్	41665	27992	0	69657
జగిత్యాల	21075	13206	0	34281
పెద్దపల్లి	18430	11638	1	30069
రాజన్న సిరిసిల్ల	13290	8323	1	21614

ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
కరీంనగర్	2512	1508	4020
జగిత్యాల	1197	509	1706
పెద్దపల్లి	609	450	1059
రాజన్న సిరిసిల్ల	633	241	874

షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్ విడుదల	03-02-2025
నామినేషన్ల చివరితేదీ	10-02-2025
నామినేషన్ల స్క్రూటినీ	11-02-2025
విత్‌డ్రాలకు చివరితేదీ	13-02-2025
పోలింగ్ తేదీ	27-02-2025
ఓట్ల లెక్కింపు	03-03-2025
ఎన్నికల ప్రక్రియపూర్తి	08-03-2025


కలెక్టర్ సమావేశానికి హాజరైన అధికారులు

దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులు

జిల్లా	కొత్త దరఖాస్తులు
కరీంనగర్	1380
జగిత్యాల	562
పెద్దపల్లి	722
రాజన్న సిరిసిల్ల	587
మొత్తం	3251

దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు

జిల్లా	కొత్త దరఖాస్తులు
కరీంనగర్	366
జగిత్యాల	68
పెద్దపల్లి	166
రాజన్న సిరిసిల్ల	76
మొత్తం	676

తక్షణమే కోడ్ అమల్లోకి..
- కలెక్టర్ పమేలా సత్పతి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళిపై జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు వంటివి తొలగించాలన్నారు. బస్టాండ్, పబ్లిక్ పార్క్ వంటి ప్రజలు సందర్శించే చోట్లలో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు, గోడలపై రాతలు తీసివేయాలని, విగ్రహాలను కవర్ చేయాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సీజ్ చేయాలని అన్నారు.

పెరగనున్న ప్రచార వేడి..

నోటిఫికేషన్ వచ్చిన దరిమిలా అభ్యర్థులు ప్రచారం వేగం పెంచనున్నారు. అదే సమయంలో ఎవరు బరిలో ఉంటారు? ఎవరు తప్పుకోనున్నారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావహుల్లో మొన్నటిదాకా ప్రచారం చేసిన సగంమందిలో ఇప్పటికే తప్పుకుంటారన్న ప్రచారం జోరందుకుంది. అన్న విషయంపైనా త్వరలోనే స్పష్టత రానుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి కాంగ్రెస్ నుంచి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పోటీ పడుతున్నారు. ఇక బీఆర్ ఎస్ నుంచి మాజీ మేయర్‌సర్దార్ రవీందర్ సింగ్, శేఖర్‌రావు, డా.బీఎస్ రావు, బీజేపీ నుంచి అంజిరెడ్డి పోటీలో ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీ బరిలో మానేరు విద్యా సంస్థల కడారు అనంత్‌రెడ్డి, పీఆర్‌టీయూ బలపరిచి వంగా మహేందర్ రెడ్డి, బీజేపీ అనుబంధ తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయం సంఘం (టపస్) తరఫున మల్క కొమురయ్య, ఎస్టీయూ నుంచి సంకినేని మాధవరావు బరిలో ఉన్నారు.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన ఆర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్‌ద్వారా సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని నియోజకవర్గ ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం


మాట్లాడుతున్న డీఈవో మాధవి

ఎలిగేడు(పెద్దపల్లి): వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి సూచించారు. ధూళికట్ట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆమె సందర్శించి పలు సూచనలు చేశారు. ఇంటి వద్ద టీవీ, సెల్‌ఫోన్‌లు తరచూ చూడవద్దన్నారు. ప్రతీసబ్జెక్టు, ప్రతీఅంశంపై అవగాహన కలిగి ఉండాలని, స్టడీ అవర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎంలు సదయ్య, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్


సమావేశమైన డైరెక్టర్ అశోకుమార్

పెద్దపల్లిరూరల్: వచ్చే వేసవిలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ మాధవరావుతో కలిసి బుధవారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫర చేయాలన్నారు. ఇందుకోసం పెద్దపల్లి మండలం రాగినేడు, సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటతో పాటు నాగారం, కన్నాల, గోదావరిఖని రాం మందిర్ ఏరియా, పీజీ సెంటర్ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామని వివరించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర అవసరాలను గుర్తించాలని సూచించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను నాయకులు ఆడెపు వెంకటేశం, తోట శ్రీనివాస్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అధికారులు రవి, తిరుపతి, ప్రభాకర్, సుగుణయ్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం సైదులు కోరారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1ను బుధవరాం ఆయన సందర్శించారు. కేంద్ర పర్యావరణ విభాగం నిబంధనలు, విధివిధానాలు, సూచనలకు అనుగుణంగా ఓసీపీ–1 ఏరియాల్లో చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ ఉదయ్‌భాస్కర్, యాక్టింగ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్ఈ(ఈఅండ్ఎం సీహెచ్‌పీ) శ్రీనివాస్, పర్యావరణ అధికారి కిషన్, సర్వే ఆఫీసర్ యానాది శెట్టి, ఇంజినీర్ నజీర్‌అహ్మద్, సెక్షన్ ఇన్‌చార్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


ర్యాలీ ప్రారంభిస్తున్న డీటీవో రంగారావు

పెద్దపల్లిరూరల్: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తేనే ప్రమాదాల నియంత్రణ సాధ్యమని జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణ నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్‌తో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆటోడ్రైవర్లతో సమావేశమై పలు సూచనలిచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్బంధ పాలనను ప్రశ్నిస్తే అరెస్టులా?

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి

గోదావరిఖని: ప్రజలులేని పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండంలో నిర్బంధ పాలన సాగుతోందని, ఇదేమని ప్రశ్నిస్తే అర్ధరాత్రి అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. దొంగలు, నక్సల్స్‌లా చూస్తూ నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, గాదం విజయ, బాదె అంజలి, నాయకులు జేవీ రాజు, అచ్చే వేణు, చల్లా రవీందర్‌రెడ్డి, రాకం దామోదర్, నారాయణదాసు మారుతి, కొలిపాక శరణ్య, శ్రీవాణి, ముద్దసాని సంధ్యారెడ్డి, సట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్లకు సన్మానం

స్థానిక తిలక్‌నగర్‌లోని తన నివాసంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తాజా మాజీ కార్పొరేటర్లను శాలువాలతో సన్మానించారు. వారి సేవలను ప్రశంసించారు. మాజీ కార్పొరేటర్లు పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, కుమ్మరి శ్రీనివాస్, బొడ్డు రజిత, జంజర్ల మౌనిక, జేవీ రాజు, రాకం లత, రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, కన్నూరి సతీశ్‌కుమార్, ముదాం శ్రీనివాస్, బాదె అంజలి, గాదం విజయ, కో ఆప్షన్ సభ్యులు రఫీక్, వంగ శ్రీనివాస్‌గౌడ్, తస్లీమభాను పాల్గొన్నారు.


మాజీ కార్పొరేటర్లను సన్మానిస్తున్న చందర్

స్థానికులకే ఉపాధి కల్పించాలి

పెద్దపల్లిరూరల్: ఎన్టీపీసీలో స్థాపించే తెలంగాణ స్టేజ్–2 విద్యుత్ ప్రాజెక్టులో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. ఈమేరకు కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందించారు.

జంతు సంరక్షణపై అవగాహన అవసరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జంతు సంరక్షణ చట్టాలపై కనీస అవగాహన అవసరమని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. జంతు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ జంతు కల్యాణ మండలి స్థాపించిందన్నారు. మూగజీవాలపై కరుణ చూపడం ప్రతీ పౌరుడి కర్తవ్యమని అన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. జంతు సంరక్షణ కోసం సేవ చేసే స్వచ్ఛంద సంస్థలకు సహకరించాలని ఆయన కోరారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్, వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ ఆఫీసు అడ్రస్ తెలిసేదెలా?

- సూచిక బోర్డు ఏర్పాటు చేయని అధికారులు
- చిరునామా తెలుసుకునేందుకు తప్పని తిప్పలు

రామగుండం: సబ్ ట్రెజరీ(ఎస్టీవో) కార్యాలయం చిరునామా తెలుసుకునేందుకు ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆ కార్యాలయం ఎక్కడుంది? అక్కడకు ఎలా వెళ్లాలి.. అసలు ఆఫీసు ఏర్పాటు చేశారా? లేదా?.. అనేమానాలు తలెత్తుతున్నాయి. నాలుగురోజుల క్రితం అవినీతి నిరోధక శాఖ అధికారులు సబ్ ట్రెజరీ అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన లంచం తీసుకుంటున్నారనే సమాచారంతో ఏసీబీ అధికారులు సబ్ ట్రెజరీ కార్యాలయానికి చేరుకునేందుకూ తిప్పలు పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం పరిపాలన భవనంలోని పైఅంతస్తులో రెండు గదులను ఎస్టీవో కార్యాలయం నిర్వహణకు కేటాయించారు. అందులోనే తాత్కాలికంగా సేవలు అందిస్తున్నారు. అయితే, ఫ్లై ఓవర్ సమీప సర్వీసు రోడ్డు పక్కన ఎస్టీవో కార్యాలయ భవనం ఉన్నా.. అక్కడ కనీసం సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు నేరుగా రైల్వేస్టేషన్ వెళ్లే మార్గంలోని ఫ్లై ఓవర్‌పైకి చేరుకుంటున్నారు. ఆ తర్వాత దారితప్పి మళ్లీ వెనక్కి వచ్చేస్తున్నారు. పట్టణంలోని పోస్టాఫీసు ఎదుట ఉన్న సర్వీసు రోడ్డు నుంచి బీ–థర్మల్ పరిపాలన భవనం వరకు చేరుకొని పక్కనున్న రోడ్డులో నుంచి లోనికి వెళ్తేనే.. పైఅంతస్తులోని ఎస్టీవో కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయం బోర్డుతోపాటు రహదారి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.


రామగుండం సబ్ ట్రెజరీ కార్యాలయం

అనేక అనుమానాలు!

- అర్హుల జాబితాలో అనర్హుల పేర్లు
- కొన్నిచోట్ల అర్హుల పేర్లు కూడా లేని వైనం
- మళ్లీ దరఖాస్తు చేయాలంటున్న అధికారులు
- నాలుగు సంక్షేమ పథకాల అమలుపై సందేహాలు

ఇతడి పేరు గన్నమనేని కిషన్‌రావు. స్వగ్రామం హన్మంతునిపేట. కొత్త రేషన్‌కార్డు కోసం నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేశాడు. ఇప్పటికీ రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తున్నామని ప్రకటించడంతో తనకూ వస్తుందని ఆశపడ్డాడు. కానీ, ఇంకా లబ్ధిదారులను ఎంపికచేయలేదు. దీంతో తనకు రేషన్‌కార్డు వస్తుందా? రాదా? అని ఆందోళన చెందుతున్నాడు.





గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు(ఫైల్)

పెద్దపల్లిరూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గత ఆదివారం నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో కొందరికి అధికారులు ప్రొసీడింగ్స్ అందజేశారు. హడావుడిగా సభ ముగించుకుని వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసిన ప్రభుత్వం.. అక్కడ వందశాతం సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. కానీ, జాబితాలో అర్హులతోపాటు అనర్హుల పేర్లు కూడా ఉన్నాయని, ఇలాగైతే తమకు సంక్షేమ ఫలాలు ఎలా అందుతాయని పేదలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాదు.. నిట్టూరుతోపాటు కమాన్‌పూర్ మండలం రొంపికుంటలోనూ అదేరోజు లబ్ధిదారులు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు కూడా.

మండలానికో గ్రామం ఎంపిక..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ఒక్కో పల్లెను ఎంపికచేసిన అధికారులు.. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయభరోసా, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డులు వందశాతం అమలు చేయాల్సి ఉంది. అయితే, అర్హుల జాబితాపైనే అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో మళ్లీ విచారణ జరిపించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రజల్లో అసంతృప్తి..

సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల అండ ఉన్నవారికే పథకాల ఫలాలు అందేలా అధికారులు జాబితా సిద్ధం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనల మేరకే ఎంపిక..

అయితే, నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే లబ్ధిదారులను ఎంపిక చేశామని అధికారులు చెబుతున్నారు. ఆత్మీయభరోసా కోసం ఉపాధిహామీ జాబ్‌కార్డుతోపాటు వరుసగా 20రోజులపాటు ఉపాధి పనులు చేసినవారే అర్హులని పేర్కొంటున్నారు. ఈ విషయం తెలియని వారు తమకు తోచిన విధంగా ఆరోపణలు చేస్తున్నారని పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి ప్రత్యేకాధికారి అలివేణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డుల జారీలోనూ నిబంధనల మేరకే వ్యవహరించామని అధికారులు వివరిస్తున్నారు.

అధికారులు ఎంపికచేసిన గ్రామాలు, లబ్ధిదారులు

మండలం	గ్రామం	ఇందిరమ్మ ఇళ్లు	రేషన్ కార్డు	రైతు భరోసా	ఆత్మీయ భరోసా
పెద్దపల్లి	నిమ్మనపల్లి	165	30	288	22
అంతర్గాం	మద్దిర్యాల	58	14	295	78
ధర్మారం	బంజేరుపల్లి	102	18	1,773	11
ఎలిగేడు	శివపల్లి	161	24	499	73
జూలపల్లి	కోనరావుపేట	165	38	1,388	09
కమాన్‌పూర్	రొంపికుంట	252	30	717	74
మంథని	అడవిసోమన్‌పల్లి	160	21	420	49
ముత్తారం	మచ్చుపేట	32	26	328	58
ఓదెల	శానగొండ	194	19	840	40
పాలకుర్తి	రామారావుపల్లి	154	26	1,570	41
రామగిరి	రత్నాపూర్	312	79	250	123
శ్రీరాంపూర్	అంకంపల్లి	89	19	911	11
సుల్తానాబాద్	కాట్నపల్లి	210	41	606	45

మళ్లీ దరఖాస్తు చేయాలంటున్నరు



కొత్తరేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న. ఈనెల 26 అందిస్తారని సంతోషపడిన. కానీ, జాబితాలో పేరు రాలేదు. అధికారులను అడిగితే జాబితా ఇంకా ఫైనల్ కాలేదని, అందులోనూ పేరు రాకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నరు.

- మిట్టపల్లి శ్రీనివాస్, పెద్దబొంకూర్

ఆందోళనవద్దు



సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందిస్తాం. జాబితాలో పేరులేదని ఆందోళన వద్దు. ఆత్మీయభరోసా కోసం ఉపాధిహామీలో వరుసగా 20రోజులు పనిచేసిన వారినే ఎంపిక చేశారు. అయినా, మళ్లీ సర్వేచేసి పొరపాట్లు సరిచేస్తారు.

- కాళిందినిదేవి, డీఆర్డీవో


లిస్టులో పేరులేదు



మాది పేద కుటుంబం. నాకు రేషన్‌కార్డు లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. సార్లు ఇంటికి వచ్చి సర్వే చేసిండ్రు. కానీ, జాబితాలో పేరు రాలేదు. ఆన్‌లైన్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నరు. నాకు రేషన్ కార్డు ఇవ్వాలి.

- అందె వెంకటేశం, జూలపల్లి

అర్హులందరికీ రేషన్‌కార్డులు



అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు అందిస్తాం. దరఖాస్తుదారుల పేర్లు జాబితాలో రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు ఇంటింటా సర్వే చేసి అర్హులను గుర్తించేపనిలో ఉన్నారు. పాతకార్డుల్లో మార్పులు, చేర్పులు ఉంటాయి.

- రాజేందర్, డీఎస్‌వో

క్లుప్తంగా

అనారోగ్య సమస్యలతో సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

రామగిరి(మంథని): పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సెంటినరీకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు దాయాకి శ్రీనివాస్(56) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఆర్నెల్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం ఉదయం తను నివాసం ఉండే సెంటినరీకాలనీ జోన్-1 లోని ఎస్‌టీ-2-551నంబరు క్వార్టరు వరండాలోగల రేకుల షెడ్డుకు ఉరివేసుకున్నాడు. భార్య అరుణ లేచి చూసేసరికి మృతి చెంది కనిపించాడు. మృతుడి పెద్దకూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి


నవీన్‌రెడ్డి (ఫైల్)

రాయికల్: రామాజీపేటకు చెందిన రైతు ఇద్దం నవీన్ రెడ్డి (32) పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. నవీన్‌రెడ్డి కేజీవీల్స్ ట్రాక్టర్‌తో నాట్ల కోసం పొలం దున్నుతున్నాడు. ఇంతలో బురదలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో బోల్తాపడింది. ఈ ఘటనలో బురదలో కూరుకుపోయిన నవీన్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్‌కు భార్య, నాలుగేళ్ల కూతురు, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. ఏడాది క్రితం నవీన్ తండ్రి మృతిచెందడంతో అప్పటినుంచి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇప్పుడు ఆయన కూడా మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డంపల్లిలో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గడ్డంపల్లిలో గడ్డం రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్యను ఈనెల16న కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే ఉండి చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 29న ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రసాద్‌రావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు పరిశీలించారు. ఇంట్లోని బీరువాలో దాచిన రూ.50వేల నగదు, వంద తులాల వెండి, తులం గోల్డ్‌చైన్ చోరీకి గురైనట్లు రాజయ్య భార్య ఓదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT GODAVARIKHANI
O.S. No: 59 of 2025

Between:
Mekala Charan Teja, ... Plaintiff
AND
1) The commissioner of Ramagundam Municipal Corporation,
2) Thakur Balwan Singh,
3) Pidapa Jayamma ... Defendants

SUMMONS THROUGH PUBLICATION

To,
D2) Thakur Balwan Singh, S/o. Rathan Singh, Age: 30 yrs, Occ: Business, R/o. H.No. 3-5-2013, Ramnagar, Ramagundam Mandal, Peddapalli District.

Whereas the plaintiff filed as suit for Perpetual Injunction in respect of suit land in Sy.No. 278 of Medipalli village of Ramagundam Mandal, Peddapalli District against the defendants.

That the above suit is posted on 18-02-2025, therefore you are hereby summoned to take present by yourself or through your counsel on 18-02-2025 at 10.30 A.M. without fail. If you absent on that day the case will be proceeded as per law and this matter will be heared exparte in your absence.

Given under this seal and signed of court Judge.

// By Order of the Court //
Sd/- Hon'ble Senior Civil Judge, Godavarikhani.
NDH. 18-02-2025

తెల్లారిన బతుకులు

- మూడు ప్రాణాలు తీసిన నిద్రమత్తు
- స్టీరింగ్ వదిలిపెట్టిన డ్రైవర్.. కల్వర్టును ఢీకొన్న కారు
- దంపతులతోపాటు మరో వ్యక్తి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- మాఘమాసం పుణ్యస్నానాలకు కాళేశ్వరం వెళ్తుండగా ఘటన
- మృతులు సిద్దిపేట జిల్లావాసులు


ఆకుల తార (ఫైల్)


ఆకుల కనుకయ్య (ఫైల్)



జనార్దన్ (ఫైల్)


కల్వర్టును ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు

సుల్తానాబాద్‌రూరల్: డ్రైవర్ నిద్రమత్తు ముగ్గురు ప్రాణాలు తీసింది. మరోఆరుగురిని తీవ్రంగా గాయపర్చింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం వేకువజామున 5.30గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో భార్యాభర్తలు ఆకుల కనుకయ్య(69), తార(62) అక్కడికక్కడే మృతి చెందారు. కనుకయ్య వియ్యంకుడు జనార్దన్(62) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆకుల కనుకయ్య మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. మాఘమాసం సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఓ ప్రైవేట్ కారును అద్దెకు తీసుకున్నారు. అందులో భార్య తార, వీరి పెద్దకుమారుడు శ్రీనివాస్(40), మనుమలు అభిత్(10), మాన్విత్(04), శ్రీనివాస్ అత్తామామలు సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గొనెపల్లి గ్రామానికి చెందిన జనార్దన్ -రమాదేవి(60), బావమరిది మనోజ్‌కుమార్(30)తో కలిసి సిద్దిపేటలో బుధవారం వేకువజామున బయల్దేరారు. వారు కాట్నపల్లికి చేరుకోగా.. నిద్రమత్తులోకి జారిన డ్రైవర్ బాల్‌రెడ్డి.. ఒక్కసారిగా స్టీరింగ్ వదిలిపెట్టాడు. దీంతో వేగంగా ఉన్న వాహనం కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కనుకయ్య, తార అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జనార్దన్ మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు శ్రీనివాస్, అభిత్, మాన్విత్, రమాదేవి, మనోజ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కనుకయ్య చిన్న కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి కరీంనగర్‌కు వెళ్లి ప్రమాద వివరాలపై ఆరా తీశారు.

కండ్లపల్లిలో అపురూప శిల్పాలు

- వెయ్యేళ్ల నాటివిగా చెబుతున్న చరిత్రకారులు
- జైనం, శైవం, వైష్ణవ శిల్పాలుగా ఆనవాళ్లు


ఋషభదేవుడు, వృషభవాహనుడు, మమ్మాయి


పరిశీలిస్తున్న బృందం

సారంగాపూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో 8వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం మధ్యకాలంనాటి వివిధ రూపాల్లో ఉన్న శిల్పాలు పదులకొద్దీ బయటపడ్డాయి. తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో వొద్దిపర్తి మధుకుమార్, చిట్నేని విజయ్‌కుమార్ కలిసి వారం రోజులుగా పరిశోధనలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వెలుగుచూసిన శిల్పాలను ఒక చోటకు చేర్చి అవి ఏ కాలంలోనివో గుర్తిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వాటి వివరాలను వెల్లడించారు. తమ పరిశోధనలో రాష్ట్రకూటశైలితో జైన తీర్థంకరుడు, ఋషభుని ధ్యానసన శిల్పం, రెండు వృషభలాంఛనాలతో ఋషభుని శిల్ప స్తంభాలు బయటపడ్డాయని, వర్ధమహావీరుని అధిష్టాన పీఠం, జైనబసది పూర్ణకలశం, 14, 15 శతాబ్దాల శైలిలో గణపతి, కేశవమూర్తులు ఇద్దరు, కుబేరుడు, విష్ణుమూర్తి, మహిషాసురమర్దిని, నాగదేవత తదితర శిల్పాలు వెలుగు చూశాయన్నారు. 17, 18వ శతాబ్దాల కాలం నాటి శైలిలో చెక్కిన లోహకారుల దేవతా మమ్మాయి శిల్పాలు, పూర్తిగా శిథిలమైన రెండు బహుభుజుల దేవతల శిల్పాలు, మరోచోట జైన తీర్థంకరుని శిల్పంతో శాసన స్తంభం బయటపడ్డాయన్నారు.

గ్రామంలో ఎటుచూసినా శిల్పాలే..

కండ్లపల్లి గ్రామంలో ఎటు చూసినా వివిధ రూపాల్లో శిల్పాలు ఉన్నాయని చరిత్రకారులు వివరించారు. వీటిపై గ్రామస్తులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో విగ్రహాలు గడ్డి, చెత్తలోనే ఉండిపోయాయి. కొందరు తమతమ భూములకు హద్దురాళ్లుగాను పెట్టుకున్నారు. ఇలాంటి వాటిపై పరిశోధన జరిపిన చరిత్ర బృందం సభ్యులు విజయ్‌కుమార్, మధుకుమార్ వివరాలు వెల్లడించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎటు చూసినా శిల్ప సంపద ఉన్న తమ గ్రామ వివరాలను ఎప్పుడూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని, వీటిపై మరిన్ని పరిశోధనలు చేయాలని గ్రామస్తులు గంగధరి పూర్ణచందర్, పర్వతం రమేశ్, వడ్లూరి రవి, కోట కిషన్, గంగధరి శ్రీనివాస్, గంగధరి శంకర్, అజ్మీర లక్ష్మణ్, గంగధరి గంగాధర్, కంది భీమన్న చరిత్రకారులను కోరారు. ప్రభుత్వం స్పందించి అద్భుతమైన ఇలాంటి వారసత్వ సంపదను పరిరక్షించాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోనరావుపేట: మండలంలోని దేవునితండా(నిమ్మపల్లి)వట్టిమల్ల, బావుసాయిపేట తండా, కమ్మరిపేట తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 400లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఏడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసులు నమోదు చేసి 8మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ, సిరిసిల్ల ఎస్సై ప్రణీత్ పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లెలో మానేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న పాక చంద్రమౌళిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28న రామలక్ష్మణపల్లెలో ఇసుక రవాణా చేస్తున్నారనే విషయం తెలుసుకున్న పత్రిక విలేకరి దేవరాజు సంఘటన స్థలానికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీశాడన్నారు. ఫొటోలు, వీడియోలు తీయవద్దని చంద్రమౌళి, అతని స్నేహితులు చెప్పగా అక్కడి నుంచి దేవరాజు వెళ్లిపోయాడన్నారు. ఆవునూర్‌లో తన ఇంటికి వెళ్లిన దేవరాజును చంద్రమౌళి బెదిరించాడన్నారు. ఫొటోలు డిలీట్ చేయకుంటే చంపుతానని బెదిరింపులకు గురిచేయడంతో దేవరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. టిప్పర్, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, చంద్రమౌళిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. దేవరాజు తనను బ్లాక్‌మెయిలింగ్ చేశాడని చంద్రమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరాజును రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ వివరించారు.

హెల్త్ చెకప్‌కు వెళ్తూ హఠాన్మరణం


మహ్మద్ అలీం కుటుంబ సభ్యులను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష


ఎంపీడీవో అలీవం పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్

- గుండెపోటుతో అంతర్గాం ఎంపీడీవో మహ్మద్ అలీం మృతి


అలీం, ఎంపీడీవో అంతర్గాం(ఫైల్)

రామగుండం: అంతర్గాం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) మహ్మద్ అబ్దుల్ అలీం(60) హెల్త్‌చెకప్ కోసం వెళ్తూ గుండెపోటుతో కన్నుమూశారు. వారంరోజులుగా అనారోగ్యంతోనే బాధపడుతున్నారు. అయినా, ప్రజాపాలన గ్రామసభలకు హాజరవుతూనే అధికారుల సాయంతో సంక్షేమ పథకాల ప్రక్రియ చేపడుతున్నారు. అయితే, డాక్టర్లను సంప్రదించేందుకు బుధవారం ఉదయం హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యంలోనే గుండెపోటు రావడంతో చనిపోయారు. అంతర్గాం ఎంపీడీవోగా ఆయన గతేడాది ఫిబ్రవరి 13న బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది ఆగస్టు 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. అలీం స్వస్థలం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ కాగా మంచిర్యాలలో నివాసం ఉంటున్నారు. విధుల నిర్వహణకు అక్కడి నుంచి వచ్చివెళ్తున్నారు. ఆయనకు ఒక కుమారుడు, భార్య ఉన్నారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ తరలించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అలీం మృతదేహానికి నివాళి అర్పించారు. ఎంపీపీ సూపరింటెండెంట్ కరుణాకర్, సిబ్బంది, సీఐ ప్రవీణ్, ఎస్సై వెంకటస్వామి తదితరులు అలీం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కలెక్టర్ పరామర్శ

పెద్దపల్లిరూరల్: ఎంపీడీవో అలీం కుటుంబసభ్యులను కలెక్టర్ కోయ శ్రీహర్ష పరామర్శించారు. గుండెపోటుకు గురైన మహ్మద్ అలీంను తొలుత పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆస్పత్రికి చేరుకుని నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయలేదని..


బార్ అండ్ రెస్టారెంట్ సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు


మున్సిపల్ కమిషనర్ లావణ్యతో బార్ యజమాని చక్రపాణి వాగ్వాదం

- సిరిసిల్లలో బార్ అండ్ రెస్టారెంట్ సీజ్
- మున్సిపల్ కమిషనర్‌తో యజమాని చక్రపాణి వాగ్వాదం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో బార్ అండ్ రెస్టారెంట్‌ను మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా సీజ్ చేయడం వివాదాస్పదంగా మారింది. సుమారు గంటన్నరసేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బుధవారం మధ్యాహ్నం పూట గిరాకీతో కళకలాడుతున్న సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్యతో పాటుగా అధికారులు వచ్చారు. అక్కడి వర్కర్లతో బార్ సీజ్ చేస్తున్నామని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. వెంటనే బార్ యజమాని తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుడు జిందం మహేందర్, భర్త జిందం చక్రపాణికి సమాచారం ఇచ్చారు. మహేందర్ వచ్చాక ట్రేడ్ లైసెన్సు ఫీజు కట్టనందుకు సీజ్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. జిందం చక్రపాణి వచ్చి ట్రేడ్ లైసెన్సు కట్టకుంటే బార్‌ను సీజ్ చేసే అధికారం మీకు లేదని మండిపడ్డారు. ఫీజు రుసుం చెల్లిస్తామని, వెంటనే వేసిన సీల్ తొలగించాలని డిమాండ్ చేశారు. చక్రపాణి డబ్బులు చెల్లించే ప్రయత్నం చేయగా కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో చెల్లించాలని కమిషనర్ లావణ్య సూచించి వెళ్తుండగా.. బార్ అండ్ రెస్టారెంట్ సిబ్బంది ఆమె వాహనం ఎదుట బైఠాయించారు. టౌన్ సీఐ కృష్ణ అక్కడికి చేరుకుని బార్ యజమాన్యంతో మాట్లాడి సర్దిచెప్పారు. బార్ యాజమాన్యం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ట్రేడ్ లైసెన్సు ఫీజు రూ.41,950 పెనాల్టీతో పాటుగా చెల్లించారు. లైసెన్స్ ఫీజు కట్టాలని ముందస్తు నోటీసులు జారీ చేయాలి కానీ, సీజ్ చేయడం సరికాదని జిందం చక్రపాణి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానం .. అధికారుల రాజకీయ కక్ష ధోరణిపై కోర్టుకు ఈడుస్తానని మండిపడ్డారు. ఎక్సైజ్ సీఐ ముస్తాఫా వచ్చి రెస్టారెంట్‌ను సీజ్ చేసే అధికారం బల్దియాకు ఉంటుందని, బార్‌ను సీజ్ చేసే అధికారం ఉండదని మున్సిపల్ కమిషనర్ ముందే మీడియాకు వివరించారు.

ఉత్సాహంగా పోలీస్ క్రీడోత్సవాలు


కబడ్డీలో తలపడుతున్న బాసర-రాజన్న సిరిసిల్ల జోన్ల మహిళా జట్లు


రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఐజీ రమేశ్ రెడ్డి

- రెండోరోజు పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఐజీ రమేశ్ రెడ్డి, సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ వేదికగా జరుగుతున్న తెలంగాణ స్టేట్ మూడో పోలీస్ స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ మీట్-2025 పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోలీస్ క్రీడాకారులు సత్తా చాటుతూ తమ జోన్లకు పతకాలు సాధించి పెడుతున్నారు. బుధవారం పలు మ్యాచ్‌లను స్పోర్ట్స్ ఐజీ రమేశ్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ప్రారంభించారు. క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, వివిధ ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని తెలిపారు. వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడా పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభం ప్రకాశ్, ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్‌ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెడల్స్ ప్రదానం..

పోలీస్ క్రీడోత్సవాల్లో భాగంగా రెండోరోజు సైకిల్ రోడ్ రేస్, ఆ ర్చరీ, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, యోగా, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. 43 బంగా రు, 43 రజత, 49 కాంస్య పతకాల పోరు సాగింది. ఆయా క్రీడల్లో విజేతలుగా నిలిచినవారికి అతిథులు మెడల్స్ ప్రదానం చేశారు.

వీడని యువతి హత్య మిస్టరీ

- జాడ లేని మృతురాలి కుమారుడు


కుమారుడితో మమత (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మంచిర్యాల జిల్లాలో అదృశ్యమై, కరీంనగర్ జిల్లాలో శవమై కనిపించిన యువతి హత్య మిస్టరీ వీడటం లేదు. గంగాధర పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని యువతి హత్య కేసు నమోదవగా మృతురాలి కుటుంబ వివరాలు మంగళవారం సాయంత్రం తెలిశాయి. అయితే, ఆమెను ఎవరు తీసుకెళ్లారు.. ఎక్కడ హత్య చేశారు, ఆమె వెంట ఉన్న నాలుగేళ్ల కుమారుడి జాడ తెలియ లేదు. కేసును ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉండే మమత కాసిపేటకు చెందిన భరత్‌ను ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. కాగా, మమత నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి మంచిర్యాల వచ్చి, తెలిసినవారి ఇంట్లో ఉంటోంది. ఈ నెల 25న సాయంత్రం నూనె ప్యాకెట్ తీసుకువస్తానని కుమారుడితో కలిసి బయటకు వచ్చింది. ఆమె కారు ఎక్కిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తర్వాత కరీంనగర్ -జగిత్యాల ప్రధాన రహదారిలో గంగాధర మండలం కొండన్నపల్లి బస్టాండ్ సమీపంలోని మామిడితోట వద్ద రోడ్డు పక్కన మమత శవమై కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి ఫొటోతో అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. మంచిర్యాలలో ఉండే ఆమె కుటుంబసభ్యులు గుర్తించి, మంగళవారం సాయంత్రం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు వారికి అప్పగించారు. మమత హత్యపై, ఆమె కుమారుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. మృతురాలు ఎక్కిన కారు ఎవరిది, అందులో ఉన్నది ఎవరు, ఎటు తీసుకెళ్లారు అనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేస్తున్నారు. త్వరలోనే హత్య మిస్టరీ వీడుతుందని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

అవకతవకలు ఉంటే క్రిమినల్ కేసులు


అధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మహిళా సమాఖ్యలో దీర్ఘకాలిక బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. తన చాంబర్‌లో రిసోర్స్ పర్సన్లతో బుధవారం బయాయిలపై సమీక్షించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికవరీ సమయంలో అవతవకలకు పాల్పడే వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని సూచించారు. మహిళాశక్తి కోసం లోన్‌బీమాలో నమోదైన క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. కొత్త యూనిట్‌లను నెలకొల్పాలని, కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీవో సంపత్, సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

31న ద్విచక్రవాహనాల వేలం

పెద్దపల్లిరూరల్: ఎక్సైజ్ ప్రొహిబిషన్ చట్టం ప్రకారం సీజ్‌చేసిన 9 ద్విచక్ర వాహనాలను ఈనెల 31న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 10గంటల్లోగా డిపాజిట్ చెల్లించి రశీదు పొందాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీ రిటేల్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్‌కు ఎస్సెస్సీ, ఫార్మసిస్టు ఉద్యోగాలకు డీఫార్మసీ లేదా బీఫార్మసీ చదవి, 18 నుంచి 35 ఏళ్ల వయసువారు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్‌లతో ఈ నెల 31న స్వశక్తి కాలేజీ పక్కన గల ఈజీఎంఎం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

ప్రేమ విఫలమై యువకుడు బలవన్మరణం

బెల్లంపల్లి: ప్రేమించిన యువతితో వివాహం కాకపోవడంతో మనస్తాపం చెంది యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతల వివేక్(21) ఇటీవల బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో ఉంటున్న తన అమ్మమ్మ రేగుల లింగమ్మ ఇంటికి వచ్చాడు. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. కుమారుడిని చూసేందుకు రెండురోజుల క్రితం అతడి తల్లి రాజేశ్వరి కూడా బెల్లంపల్లికి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వరకూ వివేక్ గదిలో టీవీ చూస్తూ పడుకోగా తల్లి రాజేశ్వరి, అమ్మమ్మ హాలులో పడుకున్నారు. బుధవారం ఉదయం నిద్రలేపేందుకు తలుపు తీసి చూడగా రేకుల పైకప్పుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. ప్రేమ విఫలం కావడంతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంపై దాతల పేర్ల తొలగింపు


ధ్వంసమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణదాతల పేర్లు

పెద్దపల్లిరూరల్: పట్టణశివారులోని పెద్దమ్మతల్లి ఆలయంపై రాసిన దాతల పేర్లు, ఆలయంలో ఉన్న కుర్చీలు తదితర సామగ్రిని ఇద్దరు వ్యక్తులు ధ్వంసం చేశారని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ సమయంలో ఆలయంపై రాసిన పేర్లను బూతగడ్డ రాజ్‌కుమార్, బూతగడ్డ నరేశ్ ధ్వంసం చేశారు. కుర్చీలను కూడా గొడ్డలితో ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకోబోయిన ఆలయ పూజారి సాగర్‌తోపాటు రాజును చంపుతామని బెదిరించారని అన్నారు. ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

పోలీసులకు దొంగ అప్పగింత

వేములవాడ: వేములవాడలోని మోచీ వీధిలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మూడు ఇళ్లలో చోరీ చేస్తూ కాలనీవాసులకు పట్టుపడ్డాడు. అతన్ని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. కాలనీవాసుల వివరాల ప్రకారం.. మోచీ వీధిలోని మూడిళ్లలో సదరు వ్యక్తి చొరబడేందుకు యత్నించాడు. సీసీ కెమెరాల వైర్‌కట్ చేశాడు. ఆ ఇండ్లలోని కొన్ని విలువైన వస్తువులను దోచుకున్నాడు. మరో ఇంటిలో చొరబడేందుకు యత్నిస్తుండగా గృహ యజమానులు సీసీ కెమెరాలను పరిశీలించి కాలనీవాసులను పోగుచేసి పట్టుకుని బంధించారు. పోలీసులకు సమాచారం అందించి, దొంగను అప్పించారు. సదరు వ్యక్తి మద్యంమత్తులో ఉన్నాడని, పూర్తి వివరాలు తెలుసుకుని వస్తువులు రికవరీ చేస్తామని పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో ఎంఐఎందే సూపర్ పవర్

- కరీంనగర్ కార్పొరేషన్‌పై పార్టీ జెండా ఎగురవేస్తాం
- నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్


బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎంఐఎందే సూపర్ పవర్ అని ఆ పార్టీ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్ అన్నారు. కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు విభజించు.. పాలించు సిద్ధాంతాన్ని పాటిస్తున్నాయని ఆరోపించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ దేశంలోని పేదల పక్షాన పార్లమెంట్‌లో అధికార పక్షాన్ని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో బీజేపీ మట్టికరవడంలో ఎంఐఎంది కీలకపాత్ర అని తెలిపారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 25 స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని, ఇక్కడ ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. అనంతరం సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్-2025 బుక్స్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఉర్దూ మీడియం పదోతరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, మాజీ కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: సిరిసిల్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సుదర్శన్ విలేకరి ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సిరిసిల్ల ధోభీగల్లీకి చెందిన వొడ్నాల విక్రం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ నెల 23న కోనరావుపేట మండలం నుంచి కలపలోడ్‌తో ట్రాక్టర్ చంద్రంపేట వద్దకు రాగానే సుదర్శన్ అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశాడని, టింబర్ యజమాని విక్రం పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి గ్రామాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైనా ధ్రువపత్రాలు లేని 11మంది ద్విచక్ర వాహనదారులకు ఎస్సై రమాకాంత్ జరిమానాలు విధించారు.